దూరం..దగ్గరైంది..

నాడు: మండలంలోని చింతగట్లతో పాటు దాదాపు ఐదు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే దాదాపు 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిందే. అయితే వీరు మేహాద్రి శీలగట్టు మీదుగా ప్రయాణం చేస్తే దాదాపు 8 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఇది సాధ్యం కావాలంటే రహదారిని అభివృద్ధి చేసి..మేహాద్రి గెడ్డ కాలువపై వంతెన నిర్మించాలి. దీనిపై అప్పట్లో టీడీపీ ప్రభుత్వానికి ఆయా గ్రామాల ప్రజలు ఎన్నో వినతులు ఇచ్చారు. ఐదేళ్ల పాటు రేపుమాపు అంటూ తాత్సారం చేశారు. అయితే ఎన్నికలకు వారం రోజుల ముందు 2019లో నాటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఉత్తుత్తి శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

నేడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు ఈ రహదారి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ప్రభుత్వం రూ.4.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మార్గంలో రూ.1.20 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో ప్రజల నెరవేరింది. ఈ రోడ్డుపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఎంతో దూరం తగ్గిందని సంబరపడుతున్నారు.




రూ.1.20 కోట్ల నిధులతో నిర్మించిన చింతగట్ల-పెదగాడి రహదారి వంతెన

- రూ.4.50 కోట్లతో పెదగాడి–చింతగట్ల రోడ్డు నిర్మాణం
- వినియోగంలోకి రూ.1.20 కోట్లతో నిర్మించిన వంతెన
- రహదారి నిర్మాణంతో తగ్గిన 8 కిలో మీటర్ల దూరం


కాలువపై నిర్మించిన వంతెన

పెందుర్తి: పెందుర్తి మండలం చింతగట్ల, నంద వరపువానిపాలెం, ఇప్పిలివానిపాలెం, జెర్రిపోతులపాలెం, నరవ, సబ్బవరం మండలం అమృతపురం, తవ్వవానిపాలెం ప్రాంత వాసులకు మండల కేంద్రం పెందుర్తి రావాలంటే ఇటు సబ్బవరం మీదుగా 16 కిలోమీటర్ల దూరం. అదే గోపాలపట్నం మీదుగా అయితే దాదాపు 19 కిలోమీటర్లు. ఈ ప్రాంతంలో కూరగాయాల పంటలు ఎక్కువ ఉండడం..వీరిలో అధిక శాతం మందికి రైతుబజారు సభ్యత్వం ఉండడంతో నిత్యం వీరు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇక ఉద్యోగులు, విద్యార్థులకు కూడా ప్రయాణం భారంగా ఉండేది. ఈ నేపథ్యంలో పెదగాడి–చింతగట్ల మేహాద్రి శీలగట్టు రోడ్డు అవసరం వీరికి ఏర్పడింది. వీరి అవసరాన్ని గుర్తించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చొరవతో ప్రభుత్వం ఈ రహదారిపై వంతెన నిర్మించడంతో పాటు రోడ్డును కూడా అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం గ్రావెల్, చిప్స్ రహదారిపై వేయగా..త్వరలోనే తారు పనులు పూర్తి చేయనున్నారు. దీంతో తమకు 8 కిలోమీటర్ల ప్రయాణ భారం తగ్గిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్నకు ధన్యవాదాలు



మా గ్రామం నుంచి పెందుర్తి వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి ఉండేది. దూరంతో పాటు చాలా వ్యయం అయ్యేది. ఇప్పుడు వంతెన అందుబాటులోకి రావడంతో ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నాం. మా గ్రామం నుంచి పెందుర్తి నిమిషాల్లో వెళ్లిపోతున్నాం. ఈ మార్గం సుగమం చేసినందుకు జగనన్నకు ధన్యవాదాలు.

–హెచ్.దేవి, చింతగట్ల

ఖర్చులు తగ్గాయి



మేం నిత్యం రైతు బజారుకు వెళతాం. కూరగాయాలు ఆటోల్లో తరలించాల్సి ఉంటుంది. దూరం ఎక్కువ కావడంతో చార్జీలు కూడా అధికంగా తీసుకునేవారు. ప్రస్తుతం ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో సగానికి పైగా రవాణా ఖర్చులు తగ్గాయి. ఈ రోడ్డు నిర్మించి ప్రభుత్వం ఎంతో మేలు చేసింది.

–కుంచె త్రినాథమ్మ, నందవరపువానిపాలెం

ప్రజల్లో ఆనందం



జగనన్న అధికారంలోకి రాగానే పెదగాడి–చింతగట్ల రోడ్డుకు కదలిక వచ్చింది. ప్రస్తుతం వంతెన పూర్తిగా అందుబాటులోకి రావడంతో ఈ మార్గంలో ప్రయాణాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. రోడ్డు పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–గనిశెట్టి వెంకటలక్ష్మి, సర్పంచ్ చింతగట్ల

క్లుప్తంగా

రైతులకు పట్టాల పంపిణీ


రైతులకు పట్టాలు అందజేస్తున్న ఎంపీటీసీ మామిడి లక్ష్మి తదితరులు

సబ్బవరం: మండలంలోని నారపాడు పంచాయతీ పరిధిలోని రైతులకు పట్టాలు, జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ దస్తావేజులను ఎంపీటీసీ మామిడి లక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారపాడు పంచాయతీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంతో గ్రామం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి కొండాజీ, కో ఆప్షన్ సభ్యుడు గొర్లి సూకరాజు,పార్టీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి సేనాపతి దుర్గా అప్పారావు,తాసుబిల్లి కనకరాజు, తుంపాల అప్పలనాయుడు, వీఆర్వో అనంత్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పరవాడ: రక్తహీనతను అధిగమించడానికి తీసుకోవాల్సిన చిరుధాన్యాలు, పౌష్టికాహారం ఆవశ్యకతపై ఈ నెల 23 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.లలితకుమారి చెప్పారు. గొర్లివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారం తయారీపై తల్లులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ఎస్.కె. షకీలా, ఏఎన్ఎం గౌతమి, అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్.దేవి, గంగాభవాని, కె.విజయ, జి.జానకి, ఆశకార్యకర్తలు చంద్రకళ, వరలక్ష్మి పాల్గొన్నారు.

తానాంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు మోక్షం


ఎన్‌ఆర్‌ఈజీఎస్ వేతనదారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పి.ఎస్.రాజు

పరవాడ: తానాం గ్రామంలో రెండేళ్లుగా అనివార్య కారణాల వల్ల నిలిచిపోయిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు చొరవతో మళ్లీ బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పనులను సక్రమంగా నిర్వహించాలని కూలీలకు సూచనలు చేశారు. జెడ్పీటీసీ ఎంపీడీవో కీర్తి స్పందన, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

పెదముషిడివాడ వీఆర్వో సస్పెన్షన్

పరవాడ: విధి నిర్వహణలో అలసత్వం వహించిన పెదముషిడివాడ వీఆర్వో కె.అప్పారావును అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి సస్పెండ్ చేస్తూ మూడు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారని డిప్యూటీ తహసీల్దార్ శశిభూషణ్‌రావు చెప్పారు. గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు వీఆర్వోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని డీటీ తెలిపారు.

నేడు సత్తెమ్మతల్లి వార్షిక జాతర


సత్తమ్మతల్లికి నూతన వస్త్రాలు సమర్పిస్తున్న శ్రీనుబాబు, వెంకటరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి వార్షిక జాతరను గురువారం వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు తెలిపారు. వార్షిక జాతరను పురస్కరించుకుని అమ్మవారి అలంకరణకు సంబంధించిన నూతన వస్త్రాలు, సామగ్రిని బుధవారం ఆలయ వర్గాలకు గంట్ల శ్రీనుబాబు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. భక్తులంతా అమ్మవారి దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గంట్ల కనకరాజు, బలిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి అభివృద్ధికి సహకారం


రైల్వే ట్రాక్ సమీపంలోని కాలువను ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి అన్నారు. జీవీఎంసీ 95వ వార్డు గవరపాలెం రైల్వే ట్రాక్ సమీపంలో రూ.36.18 లక్షలతో నిర్మించిన డ్రైనేజీని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు మాట్లాడుతూ ఇక్కడ కాలువలు లేక ఎంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులకు ఈ కాలువల నిర్మాణం ఎంతో ఊరటనిస్తుందన్నారు. ఇక్కడ డ్రైనేజీ అవుట్ లెట్ లేక వర్షాకాలంలో ముంపునకు గురయ్యేదన్నారు. అయితే కాలువలు నిర్మించాల్సిన స్థలం రైల్వేది కావడంతో ఎంపీ సత్యవతి చొరవ తీసుకుని రైల్వే అధికారులతో మాట్లాడి కాలువల నిర్మాణానికి మార్గం సుగమం చేశారన్నారు. ఎంపీ సత్యవతికి, రైల్వే అధికారులకు దేముడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అన్నంరెడ్డి అజయ్‌రాజ్, కాళ్ల గంగాధర్, దాడి అర్జున, పులమరశెట్టి లక్ష్మణ్, కాళ్ల సురేష్, ప్రసాద్, జగదీష్, సంతోస్, దేముడుబాబు, అప్పావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


ద్రవ జీవామృతం కలుపుతున్న అధికారులు

పెందుర్తి: డీఆర్‌డీఏ, ఏపీసీఎన్ఎఫ్ సంయుక్తంగా విశాఖ జిల్లాలోని 5 మండలాలకు సంబంధించి మండలానికి ముగ్గురు చొప్పున కృషి సఖిలకు ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరిగింది.ఈ శిక్షణలో మొదటి , చివరి రోజులు క్లాస్ రూమ్‌ట్రైనింగ్, మూడు రోజులు ఫీల్డ్ ట్రైనింగ్ ఇచ్చారు. తర్లువాడ, ఆనందపురం, పెందుర్తి మండలం గొరపల్లి గ్రామంలో,భీమిలి మండలం మజ్జివలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ఏవిధంగా చేస్తున్నారు.. ఎరువులు పురుగుల మందులు వాడకుండా ఏటీఎంమోడల్, ఏ గ్రేడ్ ద్రవ జీవామృతం, జిల్లేడు ద్రావణం తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఎం వైదేహి,ఏపీఎం కె.శ్రీనివాసరావు, ఎఫ్‌పీవో ఎన్.ప్రభావతి, ఎఫ్‌పీవో రామ్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ఆపాలని నిరసన


పైపులైన్ పనుల వద్ద నిరసన తెలుపుతున్న తాడి గ్రామ ప్రజలు, నాయకులు

పరవాడ: తాడి గ్రామంలో గ్రీన్‌బెల్ట్ ఏరియాలో నిర్మిస్తున్న పైపులైన్ పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. రాంకీ యాజమాన్యం చేపడుతున్న పైపులైన్ పనులను బుధవారం తాడి గ్రామ ప్రజలు నాయకులు అడ్డుకున్నారు. పైపులైన్ నిర్మాణం ద్వారా మరింత కాలుష్యం ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయని మాజీ జెడ్పీటీసీ మాధంశెట్టి నీలబాబు ఆరోపించారు. కాలుష్యం నుంచి గ్రామాన్ని కాపాడాలని విన్నవించినా ఫలితం కనిపించలేదన్నారు. ఈ మేరకు అనకాపల్లి డీఆర్వో ధయానిధికి వినతి పత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ డి.నదియా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వినతి

సబ్బవరం: మండలంలోని ఇరువాడ పంచాయతీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఆక్రమణకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభావతి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ చలమయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నవంబర్ 103,106లలో సుమారు 3 ఎకరాల గెడ్డ పోరంబోకు ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన భూమిని పరిరక్షించడంతో పాటు భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

అపార్టుమెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి


చినముషిడివాడలో నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

పెందుర్తి: నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి అపార్టుమెంట్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ సూచించారు. చినముషిడివాడ సమీపంలో ఓ అపార్టుమెంట్ ప్రాంగణంలో బుధవారం స్థానికులకు నేరాల నియంత్రణ, ప్రజల భాగస్వామ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్టుమెంట్లలో దొంగలు పరిచయం ఉన్న వ్యక్తులుగా మభ్యపెట్టి ఫ్లాట్లను కొల్లగొడుతున్నారన్నారు. నేరాలు జరిగే సమయంలో సీసీ ఫుటేజీ ద్వారా నేరగాళ్లను పట్టుకోవడానికి సహాయపడుతుందన్నారు. వేసవి వస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇల్లు విడిచి బయటకు క్యాంప్ వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో కచ్చితంగా గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అపార్టుమెంట్ ప్రతినిధులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఫ్లైయాష్ లారీల అడ్డగింత

- సమస్య పరిష్కరించాలని పైడివాడ అగ్రహారం వాసుల డిమాండ్
- న్యాయం చేస్తామన్న ఎస్ఐ ధనుంజయ్


డంపర్లను అడ్డుకొని ఎస్ఐ ధనుంజయకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు


పైడివాడ అగ్రహారం వద రోడ్డుపై డంపర్ల నుంచి జారిపడిన ఫ్లైయాష్

సబ్బవరం: మండలంలోని అసకపల్లి – లంకెలపాలెం రోడ్డులో నిబంధనలు పాటించకుండా ఫ్లైయాష్ తరలిస్తున్న డంపర్లను బుధవారం పైడివాడ అగ్రహారం ప్రజలు అడ్డుకున్నారు. గంటల కొద్దీ డంపర్లను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. కాలుష్యం కోరల్లో చిక్కుకొని తమ ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించు కోవడం లేదని వాపోయారు. రోజుకు వందలాది లారీల్లో జాగ్రత్తలు తీసుకోకుండా ఫ్లై యాష్ తరలిస్తుండడంతో బూడిద రూపంలో, ముద్దలు ముద్దలుగా రోడ్డుపై జారి పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బూడిద గాల్లో ఎగిసి పడటం వల్ల ఊపిరి ఆడక నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. బూడిదపై నీరు జల్లడం వల్ల ద్విచక్రవాహన చోదకులు జారి పడి ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎస్ఐ ధనుంజయ్ సిబ్బందితో వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. సమావేశం ఏర్పాటు చేసి, చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు లారీలను విడిచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, అక్కిరెడ్డి దురిగి నాయుడు, గొంతిన పైడిరాజు, పలువురు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడ సేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఆర్టీసీకి మహా శివరాత్రి ఆదాయం రూ.17.74లక్షలు

ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లకు నగదు పారితోషకాలు


అభినందన సభలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ రాజశేఖర్

సింహాచలం: మహాశివరాత్రి పురస్కరించుకుని రెగ్యులర్, ప్రత్యేక సర్వీసుల ద్వారా సింహాచలం ఆర్టీసీ డిపోకు 17లక్షల 74వేల 094 రూపాయల ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. ఆరోజు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు బుధవారం సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నగదు పారితోషకాలు డిపోమేనేజర్ అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినం రోజున 38,145 కిలోమీటర్లు మేర రెగ్యులర్, ప్రత్యేక సర్వీసులు నడిపామని తెలిపారు. పాడేరుకు స్పెషల్‌గా ఆరు బస్సులు నడపడం ద్వారా లక్షా 38వేల 572 రూపాయలు, అప్పికొండకు నాలుగు బస్సులు నడపడం ద్వారా 63వేల 565 రూపాయలు, ఆర్‌కె.బీచ్‌కి 14 స్పెషల్ బస్సులు నడపడం ద్వారా 2లక్షల 36వేల304 రూపాయలు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా పాడేరు స్పెషల్ బస్సు కండక్టర్ పీఆర్‌పీ రావు, డ్రైవర్ సీఎంసీహెచ్ నాయుడు, అప్పికొండ స్పెషల్ బస్సు కండక్టర్ జి.ఆర్.బాబు, డ్రైవర్, ఎస్.వై.నాయుడు, ఆర్‌కెబీచ్ స్పెషల్ బస్సు కండక్టర్ ఎల్.ఎ.కుమార్, డ్రైవర్ కె.ఎస్.కుమార్‌లకు నగదు బహుమతులు అందజేశారు అలాగే అద్దె బస్సు కండక్టర్ జె.కె.వేణి, డ్రైవర్ ఎస్.రమేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ జి.వి.రమణమూర్తి, సూపరింటెండెంట్ కె.కె.కుమారి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన


తవ్వవానిపాలెంలో మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి ప్రభాకరరావు తదితరులు

సబ్బవరం: మామిడి తోటల్లో ఎరువుల వినియోగం, కొమ్మ కత్తిరింపు వంటి యాజమాన్య పద్ధతులను సకాలంలో పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని ఉద్యానాధికారి జి. ప్రభాకరరావు తెలిపారు.మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో అమృతఫల రైతు ఉత్పత్తిదారుల మామిడి తోటలను ఉద్యానశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి తోటలకు ఆశిస్తున్న పురుగులు,తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టకపోవడం వల్ల దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారన్నారు. మామిడిలో ప్రధానంగా తేనె మంచు పురుగు, కాయ తొలుచు పురుగు వంటివి ఆశించడం వల్ల నష్టం కలుగుతుందన్నారు. వీటితో పాటు ఆకు,కాయ తినే పురుగులను నివారించేందుకు దపదఫాలుగా సస్యరక్షణ మందులు పిచికారీ చేయడం ద్వారా తెగుళ్ల ఉధృతిని నియంత్రించవచ్చన్నారు. మామిడి తోటలో పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణ ప్రణాళికను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చునని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వో కిరణ్మయి, సీహెచ్‌సీ బావన,అమృతఫల రైతు సంఘం కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ వెన్నల అప్పలనాయుడు, సీఈవో కేఎల్ఎన్ మౌక్తిక,సంఘ సభ్యులు చీపురుపల్లి నాగరాజు,చీపురుపల్లి బంగార్రాజు,గండి నారాయణబాబు,పైల అక్కునాయుడు,వెన్నల రామకృష్ణ పాల్గొన్నారు.

పోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం


మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు సాంబమూర్తి ఏసీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, వీసెజ్ జేడీసీ రోషిని అపరంజి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోర్టులో ఆధునికీకరించిన సాంబమూర్తి ఆడిటోరియాన్ని డా.అంగముత్తు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోర్టులో చక్కని పని వాతావరణం కల్పించడంలో మహిళా ఉద్యోగులు అవిరళంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో పోర్టులో మహిళా ఉద్యోగుల సంఖ్య మరింత పెరగాలని చైర్మన్ ఆకాంక్షించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న ఉద్యోగినులను చైర్మన్ సత్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా పోర్టులో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పీసీఎల్ స్వామి, సెక్రటరీ వేణుగోపాల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


రాము

పెందుర్తి: పెందుర్తి సమీపంలోని దొగ్గవానిపాలెంలో నివాసం ఉంటున్న వడ్డి రాము అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు బుధవారం ఫిర్యాదు చేశారు. రాము ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3న ఆటోతో బయటకు వెళ్లిన రాము తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో బుధవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఏఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097
సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com